
# ముత్యమంటి తొలిముద్దు

అడల్ట్స్ ఓన్లీ కథ!

A

టి.పి. హేమమాలిని



సాయంసంధ్య. శీతాకాలమైనాసరే పగలంతా తన ప్రతాపాన్ని ప్రదర్శించిన కర్మసాక్షి ఇంకా ఉంటే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందన్న భయంతో నెమ్మదిగా నిష్క్రమించాడు.

చలి చీకట్లు ముసురుకుంటున్నాయి.

అప్పటికే అలంకారం పూర్తిచేసుకున్న తనూజ మరోమారు అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంది.

లైట్ పింక్ చీర, బ్లౌజ్, పొడుగాటి జడ, ఒక పక్కగా అందంగా అమరిన ఒంటరి గులాబీ... ఒక గులాబీవనం ప్రాణం పోసుకున్నట్లుగా ఉంది. ఆమె రూపం ఆమెకే ఈర్ష్య కలిగేటట్లు ఉంది.

మంచి పొడగరి, దానికి తగ్గట్లు చక్కని అవయవ సౌష్ఠవం... ఈ అందం చూసే తనూజను పైసా కట్నం కోరకుండా పెళ్లి చేసుకున్నాడు దివాకర్.

అందంలో తనూజకేమీ తీసిపోదు అతను. మంచి ఛాయ, తీరైన తలకట్టు, కొంటెగా నవ్వే కళ్ళు అతని ఎస్సెట్స్. వీటితోనే చూపరులను కట్టిపడేస్తాడు. అతనికి స్వంతంగా ఒక ఇండస్ట్రీ ఉంది.

అన్నీ త్యజించిన సన్యాసులు తప్ప, మిగిలినవారంతా ఆ జంటను చూసి అసూయపడుతూఉండటం కద్దు.

తనూజ అస్తమానం గడియారం వంక చూస్తూ పచార్లు చేస్తోంది.

''ఏంటీయన ఇంకా రాలేదు?'' ఆమె అలా అనుకోవడం వెయ్యిన్నొకటోసారి. సాయంత్రం త్వరగా వచ్చేస్తానని చెప్పి ఉదయాన్నే వెళ్ళిపోయాడు దివాకర్. అతనికి ఆరోజు ఫారిన్ నుంచి వచ్చే ఇంజనీర్స్‌తో ఇంపార్టెంట్ మీటింగ్ ఉంది.

ఉదయాన్నే వెళ్ళేముందు తనూజ ఆరోజు విశేషాన్ని గుర్తుచేసింది.

''తనకి కూడా గుర్తుంది..'' అంటూ ఆమె చెక్కిలి మీటి వెళ్లాడతను.

ఇంతకీ ఆరోజు విశేషం?

ఆరోజు తనూజ, దివాకర్‌ల ఫస్ట్‌నైట్ డే!

వింతగా ఉంది కదూ!

అవును. అందరూ మేరేజ్ యానివర్సరీ జరుపుకుంటారు సర్వసాధారణంగా. కానీ ఆ జంట మాత్రం పెళ్ళి తర్వాత వారికి తొలిరేయి జరిగిన రోజునే సెలబ్రేట్ చేసుకుంటారు.

వారి పెళ్ళి వేసవిలో జరిగినా ఫస్ట్‌నైట్ మాత్రం మంచి ముహూర్తాలు లేని కారణంగా ఆరునెలలు వాయిదాపడి చలికాలంలో జరిగింది.

అంత ఎడబాటు తర్వాత జరిగిన మొదటి రాత్రిని వారు ఎప్పటికీ మరచిపోలేరు. అందుకే

వాళ్ళు శోభనం జరిగిన రోజే గుర్తుపెట్టుకుని ఆనందంగా గడుపుతారు.

అసలు ఈ ఐడియా ఇచ్చింది కూడా తనూజే. ఎంతో ప్రశాంతంగా తామిరువురూ ఒకరి మనసు మరొకరు తెలుసుకుని, మనస్ఫూర్తిగా మమేకమైన రోజే సెలబ్రేట్ చేసుకుందామంది. ఆమె ఆలోచన నచ్చిన దివాకర్ కూడా అందుకు అంగీకరించాడు.

కొన్నాళ్ళవరకూ పిల్లలొద్దనుకున్నారు వారిరువురూ.

రెండేళ్ళుగా జరుపుకుంటున్నట్టే ఈసారి కూడా జరిగే సెలబ్రేషన్ కోసమే ఎదురుచూస్తోంది.

ఆమె ఆలోచనల్లో ఉండగానే బయట కారు హారన్ మోగింది. దివాకర్ వచ్చేశాడు. వస్తూనే..

''సారీ హనీ! లేటయింది. జస్ట్ ఫైవ్ మినిట్స్'' అంటూ బాత్‌రూంలోకి దూరాడు చేతిలోని బ్రీఫ్ కేస్ ఆమెకందించి.

తలారా షాంపూతో స్నానం చేసి వచ్చాడు. అతని పచ్చటి ఒంటిమీద మెరుస్తున్న నీటి బిందువులని చూసి తమకంతో అతన్ని చుట్టేసింది ఆమె.

''ఏంటీ అంత తొందరగా ఉందా?'' అంటూ హస్కీగా గొణిగాడు ఆమె చెవిలో.

ఆరోజుకని ప్రత్యేకంగా కుట్టించుకున్న కుర్తా, పైజామా అందించింది.

దివాకర్ ఆ డ్రెస్ వేసుకుని, తల దువ్వుకుని పెర్‌ఫ్యూమ్స్ స్ప్రే చేసుకున్నాడు.

''కమాన్'' అంటూ కారు కీస్ తీసుకున్నాడు. అంతలోనే ఏదో గుర్తొచ్చినట్టు ''వన్ మినిట్'' అంటూ తన బ్రీఫ్‌కేస్ తెరిచాడు.

ఆమెని కళ్ళు మూసుకోమని చెప్పి ఒక చిన్న బాక్స్‌లోంచి, డైమండ్ రింగ్ తీసి తొడిగాడు. ఆమె కళ్ళు తెరచి చూసి ''మైగాడ్! డైమండ్ రింగా? దీని ఖరీదెంత?'' అడిగింది ఆశ్చర్యంగా.

''నా ప్రేమంత. ఇది డిబీర్స్ డైమండ్. స్పెషల్‌గా ఆర్డర్ ఇచ్చి చేయించాను. వజ్రం ఎప్పటికీ నిలిచి ఉంటుంది మన దాంపత్యంలా'' అన్నాడు దివాకర్.

''థ్యాంక్యూ వెరీమచ్'' అంది తనూజ.

''పద వెళ్దాం..'' అంటూ బయలుదేరాడు దివాకర్. డోర్ లాక్‌చేసి అతన్ని అనుసరించింది తనూజ.

## తరగని అందం

**వర్ధమానతార బిపాషాబసు గురించి ఎవరినడిగినా చెప్తారు. మీరేసుకునే డ్రెస్సులే మీకు అసెట్ అని అందరి చేత అన్పించుకునే బిపాషాని డ్రెస్సుల గురించి అడిగితే చాలా చెప్పుకొచ్చింది. 'సెక్సీతారగా అందరినుంచీ అభినందనలు అందుకునే నేను సందర్భానికి తగ్గ డ్రెస్సుల్ని ధరిస్తాను. నేను చాలా స్టయిల్‌గా ఉంటానంటారంతా. నా పర్సనాలిటీకి తగిన డ్రెస్సులు ధరిస్తేనే నా ఇమేజ్‌ని కాపాడుకోగలను. డీప్‌కలర్స్ నా స్కిన్‌కి చాలా బావుంటాయి. మెరూన్‌కలర్ నా మనసు దోచేస్తుంది. పొడవుగా ఉంటాను కాబట్టి ఆ పొడవుకి తగిన డ్రెస్సులు ధరించడం తప్పనసరి. అలాంటివి ధరిస్తేనే తరగని అందంతో అందరి కళ్ళల్లో పడొచ్చు' అంటూ తన అందం వెనుకున్న గుట్టుని రట్టు చేసింది.**



అతనేవేవో కబుర్లు చెప్తూనే ఉన్నాడు. ఎప్పుడూ అంతే! అతనే ఎక్కువగా మాట్లాడతాడు. మంచి శ్రోతగా ఉండడమే ఆమెకిష్టం.

కారు వేంకటేశ్వరస్వామి గుడి ముందాగింది. ఇద్దరూ లోపలికి వెళ్లారు. వీరిని చూసిన పూజారి ప్రత్యేకంగా సహస్ర నామాలతో అర్చన చేశాడు స్వామికి.

''మీరు చెప్పిన విధంగానే అన్నదానం జరిపించాం బాబూ!'' అన్నాడు ప్రసాదం అందిస్తూ.

ప్రతి ఏటా ఆరోజు పేదలకు అన్నదానం చేయిస్తాడు దివాకర్. పూజారి వద్ద సెలవు తీసుకుని బయల్దేరారు.

''సినిమాకెళ్దామా?'' అడిగాడు దివాకర్.

''ఇప్పటికే స్టార్టయిపోయి ఉంటుంది. ఏడవుతోందిగా టైమ్'' అంది తనూజ.

అయితే బీచ్‌కి వెళ్దామంటూ కారుని అటుగా పోనిచ్చాడు. కార్ పార్క్ చేసి కూచున్నారు చాలా సేపు.

ఆమె ఒళ్ళో తలపెట్టుకుని పడుకున్నాడు అతను.

''దివాకర్! నేను చాలా అదృష్టవంతురాలిని కదూ!'' అంది తనూజ.

''ఇదిగో ఇలాంటి రొటీన్ డైలాగ్సంటేనే చిర్రెత్తుకొస్తుంది నాకు. రొటీన్‌కి భిన్నంగా ఉండాలనే కదా మనం వైరైటీగా ఫస్ట్‌నైట్ డేని సెలబ్రేట్ చేసుకుంటున్నాం. అలాంటి డైలాగ్స్ వద్దమ్మా'' అన్నాడు బుంగమూతి పెట్టి.

''ఓకే ఓకే..'' అంది ఆమె నవ్వేస్తూ.

''సరే! డిన్నర్ చేసేద్దామా డాల్ఫిన్‌లో'' అన్నాడు.

''ఏంటీరోజు కొత్తగా మాట్లాడుతున్నారు. బయటెక్కడా భోజనం చేయరుగా!'' అంది ఆమె.

''కానీ నీకు ఇష్టం కదా! అందుకే అన్నాను''

''నిజమే! కానీ ఇంటిదగ్గర అన్నీ చేశాను. ఇద్దరం కలిసే తిందాం''

''అయితే ఐస్‌క్రీమ్ తిందాం'' అంటూ రెస్టారెంట్ వైపు నడిచాడు.

తర్వాత స్వీట్స్, ఫ్రూట్స్ తీసుకుంటుండగా అతను ఏదో ప్యాకెట్ విప్పి నోట్లో వేసుకోవడం ఆమె దృష్టిపథాన్ని దాటిపోలేదు.

కారు ఇంటిముఖం పట్టింది.

★ ★ ★

అతనికిష్టమైన గులాబ్‌జామ్, మసాలాగారెలు, పులిహోర వంటివాటితో ఆమె కొసరి కొసరి వడ్డించగా తృప్తిగా భోంచేశాడు దివాకర్.

మగవాడి హృదయానికి దారి అతని కడుపు ద్వారానే అన్న విషయాన్ని ఖచ్చితంగా పాటిస్తుందామె.

బెడ్‌రూంలోకి అడుగుపెట్టిన దివాకర్‌ని ఆశ్చర్యానందాలు ముంచెత్తాయి.

''వావ్! మార్వలెస్'' అప్రయత్నంగా వెలువడింది అతని నోటినుంచి.

వారి మంచం స్పెషల్ ఆర్డర్‌పై తయారైనది. పాతకాలం నాటి పందిరి మంచం టైపులో బాగా ఎత్తుగా, విశాలంగా ఉంటుంది.

ఆ మంచానికి ఉన్న బద్దెల మీదుగా జాజి, మల్లెపూల దండలు వేలాడుతున్నాయి.

మంచం మీద ఉన్న బెడ్‌షీట్ తెల్లదనం, దాని మీద నిండా పరచి ఉన్న మల్లెపూలతో పోటీపడుతోంది.

గదంతా అగరువత్తుల ధూపం అలుముకుంది. శుక్లపక్ష చంద్రుని వెన్నెల కిటికీ గుండా ప్రవేశించి ఆహ్లాదాన్ని కలిగిస్తోంది.

దివాకర్‌లో రొమాంటిక్ మూడ్ రెట్టింపయింది.

అదే సమయంలో గదిలోకి అడుగుపెట్టింది తనూజ. ఇప్పుడు ఆమె అలంకరణ నవ వధువును తలపించేలా ఉంది.

తెల్లటి జరీచీర, జాకెట్. తలనిండా విరజాజి మాల, సౌందర్య భారంతో ఆమె శరీరంలోని అణువణువూ అతిశయాన్ని ప్రదర్శిస్తోంది.

ఆమెని చూడగానే మోహావేశుడయ్యాడు దివాకర్.

## తారా ఆశ

**'జాన్ అబ్రహాంకి నీకూ ఏదో ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి కదా' అని తారాశర్మని అడిగితే అందరూ చెబుతున్నట్టుగానే నవ్వేసింది. 'ఈ రూమర్లు మేమిద్దరం తెగ నవ్వుకున్నాం. ఇలాంటి రూమర్లు ఇండస్ట్రీలో సహజమే. అయితే దీని గురించే ఆలోచిస్తూ బాధ పడుతూ కూర్చోవడం ఎంతవరకూ సమంజసం? రూమర్లు రావడం, పోవడం సహజమే. అందుకే వాటికంత ప్రాధాన్యత ఇవ్వడం మంచిదికాదు' అంటోంది తారా. కెరీర్‌లో నేను వెనుకబడి ఉన్నా ఎప్పటికైనా మున్ముందుకు దూసుకుపోవడం ఖాయం. అప్పటివరకూ ఇలాంటివి కామనే'అంటూ వేదాంతం వల్లిస్తోంది.**

అశోక, అరవింద, చూత, నీలోత్పల, వనమల్లికా శరాలను ఒక్కసారిగా సంధించాడు పంచబాణుడు.

''ఏయ్ తనూ! ఎంతందంగా ఉన్నావో తెలుసా!'' గుసగుసలాడాడు.

''రొటీన్ డైలాగ్‌లు వద్దమ్మా'' అంది సున్నాలా మూతిపెట్టి.

అతను నవ్వేశాడు, ఆమె తనని ఇమిటేట్ చేసిందని గ్రహించి.

తన చేతిలో ఉన్న వెండిగ్లాసు అతనికి అందించింది. సుగంధ ద్రవ్యాలు వేసిన పాలున్నాయి అందులో. ఇద్దరూ కలిసి పాలు తాగారు.

ఇక ఆగలేనట్లు దివాకర్ రసాస్వాదనకు సిద్ధమయ్యాడు. ఈ అనుభవం కొత్త కాకపోయినా సరి కొత్తగా సిగ్గుపడింది తనూజ.

తొలిగా ఆమె పచ్చని పాదాలపై మెరుస్తున్న మువ్వలని స్పృశించాడు. నెమ్మదిగా పైకి వెళ్తూ ముద్దులతో ముంచెత్తసాగాడు. ఆమె ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

అనుభవజ్ఞుడైన సంగీత విద్వాంసుడు, ఎన్నో సంగీత పరికరాలను శ్రుతిచేసినట్లుగా అతను ప్రవర్తిస్తుంటే వింత రాగాలాపన చేస్తోంది ఆమె శరీరం.

మెడ మీద మెత్తగా స్పృశించాడు. తమకంతో ఆమె పెదాలు అందుకున్నాడు.

నాలుగు పెదవులు కలిసి అధర సుధాన్వేషణ చేసేవేళ, ఆనందం అర్ణవమయ్యేవేళ, శృంగారం తారాస్థాయికి చేరే తరుణాన..

దివాకర్ పెదవులు, ఆమె పెదవులని తాకగానే తనూజ మూడంతా అవుటయింది. ఆమె ముఖం కొద్దిగా పక్కకు తిప్పుకుంది.


ఎందుకిలా తరచు జరుగుతోంది? సుఖానుభూతిని తనెందుకు అనుభవించలేకపోతోంది? కారణం..అదే వాసన!

అమె మనసు ఆలోచనల్లోకి వెళ్ళిపోయింది.

ఇవేమీ గమనించని దివాకర్ ఆమెలో లీనమయ్యాడు. అతని కదలికలకు అనుగుణంగా స్పందించసాగింది ఆమె శరీరం అప్రమేయంగానే.

★ ★ ★

తనూజ దీర్ఘాలోచనలో మునిగి ఉంది. నిజంగా తాను చాలా అదృష్టవంతురాలు. పేద కుటుంబంలో పుట్టిన ఆమెకి తల్లిదండ్రులు



ఇచ్చిన ఆస్తి ఒక్కటే... అందం. అయితే ఆ అందం చూసి ఎప్పుడూ విర్రవీగలేదు. కానీ తనని దివాకర్ ఏరి కోరి వరించాక, ఆ అందమే కదా తనకి ఇంత అదృష్టాన్ని సంపాదించిపెట్టింది అనుకుని అప్పుడప్పుడు ఆనందించేది. దివాకర్ లాంటి మంచి భర్తని తన పూర్వజన్మ పుణ్యం వల్లనే పొంది ఉంటుందని ఆమె ప్రగాఢ విశ్వాసం.

అందగాడు, ధనవంతుడు, ఏ దురలవాట్లు లేనివాడు తనని పెళ్లి చేసుకోవడం ఆమెకిప్పటికీ ఒక కలలాగే అనిపిస్తుంటుంది.

అయితే ఏ లోటూ లేకపోయినా, ఆమె బాధపడే విషయం వేరొకటి ఉంది. ఆమె శృంగార జీవితాన్ని పూర్తిగా ఎంజాయ్ చేయలేకపోతోంది.

అంటే దివాకర్ వలన ఆమెకి అసంతృప్తి కలుగుతోందని కాదు. అతను ఆమెను స్వర్గలోకాలలో విహరింపచేయగలడు.

కానీ పరిపూర్ణత లేదు. ఎందుకు?

ముద్దు! ముద్దు!

శృంగారంలో ప్రథమస్థానం ముద్దుది. రెండు శరీరాల ప్రథమ ప్రత్యక్ష ప్రతిస్పందన చర్య అది. మన శరీరంలోని అనేకానేక నాడుల అసంకల్పిత ప్రతీకారచర్య అది.

ముద్దు ఒకటే అయినా అది పొందే స్థానాన్ని బట్టి భావం మారుతుంది. మోహంతో పెదవులపై, వాత్సల్యంతో నుదుటిపై, అనురాగంతో చెక్కిలిపై.. ఇలా రకరకాలు.

కానీ ఆ ముద్దులోని మాధుర్యం ఏమిటో ఇప్పటికీ తెలియదు తనూజకి.

రెండు శరీరాలు ఏకమయ్యే పోరాటంలో, నాలుగు పెదవులు చేసే చిలిపి తగవు ఆమెకి అనుభవంలోకి రాలేదు.

అతను పెదవులను దగ్గరకు చేర్చగానే, అతని నోటినుంచి వచ్చే వెగటు వాసన ఆమెకి పడదు. భరించలేనట్లు ముఖం తిప్పేసుకుంటుంది. అతనెలా ప్రవర్తించినా అడ్డుచెప్పదు. కానీ తనూజకు మాత్రం తొలిముద్దు అనుభవం జరగలేదనే చెప్పవచ్చు. దివాకర్‌తో ఎన్నోసార్లు తన మనసులోని కోరిక చెప్పాలని ప్రయత్నించి, అతనేమైనా నొచ్చుకుంటాడేమోనని వెనుకంజ వేసింది.

దివాకర్‌కి ఏ అలవాట్లూ లేవనుకున్నాం కదా! మరి వాసన..?

అది గుట్కా వాసన. అతను తరచు బిజినెస్ పనుల మీద తిరగాల్సి రావడం, టెన్షన్స్‌కి గురికావడం జరుగుతుంది. వాటిని పోగొట్టుకోవడం కోసం వేసుకునే పాన్‌పరాగ్, తర్వాత ఇంచుమించు వ్యసనంగా మారింది.

తనూజ ఎన్నోసార్లు అన్యాపదేశంగా చెప్పి చూసింది. కానీ కొన్ని సమయాలలో దానివల్ల రిలీఫ్ వస్తుందంటాడు దివాకర్. అది అతని

భ్రమ అని వాదిస్తుంది ఆమె. ఆ విషయం తనకు తెలుసనీ అయినా మానలేక పోతున్నాననీ అంటాడు.

'రాష్ట్రంలో గుట్కా నిషేధం' అన్న వార్త విని ఎంతో సంతోషపడింది. కానీ అది ఎన్నాళ్ళో నిలువలేదు. బ్లాక్‌లో మామూలు మనుషులకే ఈజీగా దొరికే గుట్కా తన భర్తకి దొరకడం ఏమీ కష్టం కాదని గ్రహించింది.

అందమైన ఆమె జీవితంలో ఉన్న సున్నితమైన చిన్న సమస్య ఇది. ఇదీ ఓ సమస్యేనా? అన్పిస్తుంది వినేవారికి. కానీ ఏదైనా అనుభవైకవేద్యమవాలి.

అలా ఆలోచనల మధ్య కొట్టుమిట్టాడుతున్న తనూజ బుర్రలో 'ఛమక్' మందో ఉపాయం. ఇన్నాళ్ళుగా ఆ ఐడియా తనకెందుకు రాలేదోనని అబ్బురపడింది.

''ఎస్! అలా చేస్తే సరి'' అనుకుంది తనూజ.

★ ★ ★

ఆరోజు మంచి ఉత్సాహంగా ఉన్నాడు దివాకర్. ఎందరికో రాకుండా పోయిన టెండర్ అతనికి దక్కింది.

వస్తూనే మంచి మూడ్‌లో ఉన్న అతను, రెట్టించిన ఉత్సాహంతో ప్రవర్తించాడు ఆ రాత్రి.

ఎర్రగా ఊరిస్తున్న తనూజ అధరాలు అందుకున్నాడు. అంతే.. ఒక్కసారిగా ఆమెని వదిలేశాడు.

''ఏమిటి నీ నోరంతా వాసన?'' అడిగాడు ఆమెని.

''వాసనా! ఓ ...అదా! ఏంలేదండీ. మన పని మనిషి చెప్పింది. గోంగూర పచ్చడిలో పచ్చి ఉల్లిపాయ నంజుకుని తింటే బావుంటుందని. దాంతో ఆ టేస్ట్ ఎలా ఉంటుందోనని చూశాను. అబ్బ! భలే బావుంది. అందుకే అదే పనిగా రెండుమూడు ఉల్లిపాయలు నంజుకుని తినేశాను. ఇంతవరకూ తెలియదండీ! ఇంత రుచిగా ఉంటుందని'' చెప్పుకుపోతోంది తనూజ.

మూడ్ మారిపోయిన దివాకర్, పాలపొంగుపై నీళ్ళు చల్లినట్లు నిస్సత్తువగా అయిపోయి, పక్కకు తిరిగి పడుకున్నాడు.

అతన్ని చూసి జాలిపించినా తన పథకం నెరవేరబోతున్నందుకు ఆనందించింది తనూజ.

★ ★ ★

''నీకు గోంగూర పచ్చడంటే అంత ఇష్టమని ఇన్నాళ్ళూ నాకు తెలీదే!'' ముక్తసరి అన్నాడు దివాకర్. ''ఏంటోనండీ! ఎన్ని ఐటెమ్స్ ఉన్నా గోంగూర పచ్చడితో అన్నం తినకుండా ఉండలేకపోతున్నాను, అదీ ఉల్లిపాయతోనే'' హుషారుగా బదులిచ్చింది.

అప్పటికి అది ఎనిమిదోరోజు. రోజూ అదే తంతు.

క్యాజువల్‌గా ఆమెని దగ్గరకి తీసుకున్నాడు. ఆమె శరీరం నుంచి అదోరకమైన వాసన. ఉల్లిపాయలు తరిగాక చీరకే చెయ్యి తుడుచుకున్నట్లుగా ఉంది.

''తనూ! స్నానం చేయలేదా సాయంత్రం''

''లేదండీ చలికాలమే కదాని సాయంత్రం స్నానం చేయలేదు''ఆమెనేమనలేక కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

★ ★ ★

మళ్ళీ పౌర్ణమి వచ్చింది. నిండు చంద్రుడు అందంగా ప్రకాశిస్తూ జగానికంతటికీ బెడ్‌లైట్ అయ్యాడు. భోజనాలు ముగించిన తనూజ, దివాకర్‌లు పై అంతస్తుకి చేరుకున్నారు.

ప్రతి పున్నమికి మేడపైన పడుకోవడం అలవాటు వారికి. అది ఏ కాలమైనాసరే! చలికాలంలో కూడా వెచ్చటి రొజాయ్ కింద ఇద్దరూ దూరి పడుకుంటారు. అందుకనే సాయంత్రమే పనిమనిషి చేత డాబా కడిగించి పక్క సిద్ధం చేసింది.


దుప్పటి తెల్లదనాన్ని చూసి వెన్నెల సిగ్గుపడుతోంది.

ఏదో మ్యాగజైన్ తిరగేస్తున్న అతన్ని తనవైపు తిప్పుకుంది ఆమె. తన ముచ్చట్లతో అలరించింది.

తనూజ తన పెదవులను అతని పెదవుల దగ్గరగా చేర్చింది, అతనిలోని మార్పుని రెండురోజుల క్రిందటే గ్రహించింది కనుక.

అంతే! అతని కళ్లల్లో సంభ్రమాశ్చర్యాలు.

ఇనుమడించిన ఉత్సాహంతో వాటిని వదిలిపెట్టలేదు దివాకర్. దాహార్తుడికి దొరికిన అమృత చెలమలా ఉంది అతని స్థితి. మథన కదనానికి రంగం సిద్ధమైంది. చల్లగాలి సన్నగా వీస్తూండడంతో వారిని ఎంకరేజ్ చేస్తున్నట్లు ఫీలయ్యారు.



ఇద్దరూ మధుర లోకాలలో విహరించారు.

మొట్టమొదటిసారిగా తనూజకు 'ముద్దు'లోని ఆనందం అనుభవైకవేద్యమయింది. ఆమె అనుభవించిన శృంగారానికి పరిపూర్ణత సిద్ధించింది. కొంతసేపు తర్వాత దివాకర్ ఆమె ముంగురులను సవరిస్తూ...

''ఏం? ఈరోజు గోంగూర పచ్చడి తినలేదు తమరు?'' అడిగాడు.

''ఇంక తినాల్సిన అవసరం ఉండదులెండి'' కొంటెగా బదులిచ్చింది.

''నిన్నూ...'' అంటూ చాలారోజుల విరహాన్ని మరోసారి తీర్చుకోవడానికన్నట్లు ప్రభంజనమై ఆమెని కమ్మేశాడు.

ఉపసంహారం:- మొదటినుంచీ దివాకర్‌కు ఉల్లిపాయ వాసనంటే పడదని తెలుసు తనూజకు. కూరలు కూడా ఉల్లిపాయ లేకుండానే వండుతుంది. అదే ట్రిక్ ప్లే చేసిందామె. తనూజపై గల ప్రేమకొద్దీ, తనకు పడని ఉల్లిని ఆమె తినకూడదని శాసించలేదు దివాకర్. ఆమె అభిరుచిని కాదనలేక, తనే మారాడు. సహజంగా శృంగారాభిలాష కలవాడైన దివాకర్, తన లోపాన్ని చెప్పకనే చెప్పిన తనూజ మనసు నొప్పించదలచుకోలేదు. అయితే గుట్కా స్థానంలో వక్కపొడి వేసుకోసాగాడు నమిలే అలవాటును మానలేక.

☆

## అదృష్టం

**వరుస హిట్‌లతో సినిమా ఛాన్స్‌లు కొట్టేసే హీరోయిన్లు మన ఇండస్ట్రీలో చాలా తక్కువమందే అని చెప్పవచ్చు. తాను ధరించే పాత్రలకి న్యాయం చేస్తూ, కుటుంబ సమేతంగా సినిమాలు చూడొచ్చనే భరోసా ఇచ్చే నటి లయ. ఇప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో మంచి అవకాశాలతో దూసుకెళుతున్న లయ తన అభినయానికి న్యాయం చేసే పాత్ర మిస్సమ్మ చిత్రం ద్వారా లభించిందంటున్నారు సినీ విమర్శకులు. సుస్వాగతం, ప్రేమించు వంటి చిత్రాలకి భిన్నంగా అవార్డుల దర్శకుడు నీలకంఠ నిర్మించిన ఈ సినిమాలో లయ తన పాత్రకి సంపూర్ణన్యాయం చేసిందంటున్నారు. లయకి అదృష్టం బాగానే కలిసొస్తోంది.**